క్లుప్తంగా

విద్యార్థుల అగచాట్లు


ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏపుగా పెరిగిన పచ్చగడ్డిపై కూర్చున్న విద్యార్థులు

నిడదవోలు: పైన సుర్రుమని తగిలే ఎండ వేడిమి, కింద కఠిక నేలపై ఏపుగా పెరిగిన పచ్చగడ్డిపై కుర్చున్న విద్యార్థులు నానా అగచాట్లు పడ్డారు. వేదిక పై నుంచి అధ్యాపకుల ఒకరి తర్వాత ఒకరు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారే పప్పా విద్యార్థు ఇబ్బందులను పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఆదేశాలతో స్థానిక ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.మేరీ సుజాత అధ్యక్షతన శనివారం సంకల్ప్–2025 కార్యాక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలో ఉన్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడం, సబ్జెక్టుకు సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలు, జావాబులతో కూడిన మెటీరియల్ అందించి ప్రత్యేక తరగతులు నిర్వహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఇదంతా బాగానే ఉన్నా విద్యార్థులను కఠిక నేలపై కుర్చో పెట్టడం విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. పచ్చిగడ్డిలో ఏ విషపు పురుగు ఉంటుందోనని ఆందోళన చెందించారు. అనుకోని సంఘటన జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని, పేద విద్యార్థులపై ఇంతటి నిర్లక్ష్యమేమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కళాశాలలో ఏపుగా పెరిగాఇన పచ్చగడ్డి, పిచ్చి మొక్కలను తొలగించాలని విద్యార్థులు, వారు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈ నెల 12 నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

నిడదవోలు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఈనెల 12వ తేదీ నుంచి జనవరి 7వ తేదీవరకు రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ శనివారం తెలిపారు. ఈనెల 12న తాడిమళ్ల, 13న సమిశ్రగూడెం, 16న మునిపల్లి, 17న రావిమెట్ల, 18న కోరుమామిడి, 19న ఉనకరమిల్లి, 20న సూరాపురం, తిమ్మరాజుపాలెం గ్రామాల్లో సభలు నిర్వహించనున్నారు. 21న కంసాలిపాలెం, 23న కోరుమామిడి–2, 24న సింగవరం, 26న శెట్టిపేట, తాళ్లపాలెం, 27న అట్లపాడు, 28న గోపవరం, 30న విజ్జేశ్వరం, 31న పురుషోత్తపల్లి, జనవరి 2న డి.ముప్పవరం, 3న పందలపర్రు, 4న జీడిగుంట, 6న కలవచర్ల, కోరుపల్లి, 7న పెండ్యాల గ్రామ సచివాలయాల వద్ద నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

తాళ్లపూడి: అన్నదేవరపేటలో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. గ్రామంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయం సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేశామన్నారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేసి, రూ.8130 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ప్రసాదరెడ్డి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నిడదవోలు : ప్రముఖ వ్యాపారవేత్త సత్తి ప్రసాద్ రెడ్డి మాతృమూర్తి సత్తి బుల్లి వీరమ్మ ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను శనివారం మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు పరామర్శించారు. ఆయనతో పాటు సత్తి వేణుమాదవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, దాకే అనిల్, గోపిరెడ్డి శ్రీను, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారు


ప్రక్కిలంకలో పుష్పాలతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అలంకరణ


అన్నవరప్పాడులో విశేష అలంకరణలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి


కొవ్వూరు ఏటిగట్టుపై ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి


గోపాలపురంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

వైభవంగా షష్ఠి ఉత్సవాలు

- సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- తెల్లవారు జాము నుంచే బారులు తీరిన భక్తులు

దేవరపల్లి: సుబ్బారాయుడి షష్ఠి ఉత్సవాలు శనివారం గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. మండలంలో తెల్లవారు జామున నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు బారులు తీరారు. స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. దేవరపల్లిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం భక్తులు బారులు తీరారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు భక్తుల రద్దీ ఉంది. సాయంత్రం 4 గంటల నుంచి స్వామి, అమ్మవార్లను గ్రామంలో ఊరేగించారు. స్థానిక శ్రీదేవి, భూదేవి ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో బర్తుల రద్దీ ఏర్పడింది. మండలంలోని యర్నగూడెం, చిన్నాయగూడెం, యాదవోలు, త్యాజంపూడి, కురుకూరు, దుద్దుకూరు, గౌరీపట్నం గ్రామాల్లో షష్ఠి ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

నిడదవోలు : పట్టణంలో చినకాశిరేవులో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో శనివారం షష్ఠి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ చినకాశిరేవులో భక్తులు వేకువజామున గంగా స్నానాలు చేసి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామివార్ల దర్శనానికి భక్తులు పొటెత్తారు. స్వామివారిని మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు దర్శించుకున్నారు. పట్టణంలో గాంధీబొమ్మ సెంటర్ వద్ద తీర్థం నిర్వహిస్తున్నారు. నిడదవోలు సీఐ తిలక్, పట్టణ ఎస్సై శోభన్‌కుమార్ పూర్తిస్థాయిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, కొత్తపల్లి సుప్రియ, మొదలవలస నాగమణి, గోపిరెడ్డి శ్రీనివాస్, అర్చకులు ఘంటశాల వెంకట సుబ్బారావు, ఘంటశాల ఉమాచంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు తొలేటి కోటేశ్వరరావు, మొదలవలస నాని, ఆలమూరి రాజ తదితరులు పాల్గొన్నారు.


దేవరపల్లిలోని సుబ్రహ్మణ్యస్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఉండ్రాజవరం: మండలంలో సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచే పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక, సంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ మీసాల వెంకట్రావు, ఆర్చకులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. రాత్రి స్వామి వారి ఊరేంగిపు ఘనంగా నిర్వహించారు.

పెరవలి: మండలంలో షష్ఠి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. తెల్లవారుజాము రెండు గంటల నుండే భక్తులు ఆలయాలకు పెద్ద ఎత్తున రావడంతో కిటకిటలాడాయి. అన్నవరప్పాడులో సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. కానూరులో జరిగిన ఉత్సవాల్లో వేలాది మంది పాల్గొనడంతో నిడదవోలు–నర్సాపురం ఆర్‌అండ్‌బీ రహదారి భక్తులతో నిండి ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. ముక్కామలలో సుబ్రహ్మణ్యేశ్వస్వామి అమ్మవార్లను గ్రామోత్సవం నిర్వహించారు.


కొవ్వూరు ఏటిగట్టుపై సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తజనం

కొవ్వూరు: స్థానిక ఏటిగట్టుపై ఉన్న వల్లీ సమేత సుబ్రహ్మణ్యేశ్వస్వామి వారి దర్శనం కోసం భక్తులు తెల్లవారు జాము నుంచే ఆలయం వద్ద బారులు తీరారు. సాయంత్రం ఏడు గంటలకు స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు. గోష్పాదక్షేత్రంలోను, సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వస్వామి ఉప ఆలయాల్లోను పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

తాళ్లపూడి: మండలంలో షష్ఠి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాళ్లపూడిలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పెద్దేవంలో స్వామివారిని దర్శించేందుకు భక్తులు బారులుతీరారు. ప్రక్కిలంకలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. వేగేశ్వరపురం, రాగోలపల్లి, తాడిపూడి, అన్నదేవరపేట, తిరుగుడుమెట్ట, గజ్జరం గ్రామాల్లో షష్ఠి వేడుకలను నిర్వహించారు.

గోపాలపురం: మండలంలోని సుబ్రహ్మణ్యే స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని చిట్యాల, దొండపూడి, సాగిపాడు, జగన్నాధపురంగ్రామాలలో షష్ఠి ఉత్సవాలు ఘనంగా చేశారు.

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలంలోని వాడ వాడలా షష్ఠి మహోత్సవాలు శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తాడిమళ్ల, రావిమెట్ల గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సమిశ్రగూడెంలోని శ్రీపర్వత వర్ధిని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కల్యాణం నిర్వహించి ప్రత్యేక అభిషేకాలు చేశారు. పెండ్యాల, పందలపర్రు, కంసాలిపాలెం, కాటకోటేశ్వరం గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


పట్టణంలో సుబ్రహ్మణ్య స్వామి వారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు


ఉండ్రాజవరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంత్రి దుర్గేష్


పెరవలి ఆలయం వద్ద భక్తుల రద్దీ

మిశ్రమ పంటలు.. ఆదాయ మార్గాలు


తెలికిచెర్లలో సాగుచేస్తున్న కాశ్మీర్ యాపిల్‌బేర్


యాపిల్ బేర్ తోట

- పండ్ల తోటల సాగుపై ఆసక్తి
- లాభాలను ఆర్జిస్తున్న రైతులు

నల్లజర్ల: సంప్రదాయ సాగులో పెట్టుబడులు పెరిగి ఆదాయం రాకపోవడంతో రైతులు పండ్ల తోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. నల్లజర్ల మండలం తెలికిచెర్లకు చెందిన రైతులు చవ్వాకుల శోభన్‌బాబు, కొటికలపూడి వెంకటేశ్వరావు, నాయుడు సత్యనారాయణ, వడ్డికాసులు ఏటా వరి సాగు చేసేవారు. పెట్టుబడులు పెరగడం, కూలీల కొరత, నీటి లభ్యత తగ్గడం వంటి తదితర అంశాలు పరిగణనలోకి తీసుకొని దీర్ఘకాలికంగా పెట్టుబడులు రావడానికి పంట మార్పిడి చేయాలని భావించారు. ఈ క్రమంలోనే పండ్ల తోటలు సాగును మొదలుపెట్టారు. ఖమ్మం జిల్లా సారపాక ప్రాంతం నుంచి కాశ్మీర్ యాపిల్ బేర్ నారును తీసుకువచ్చి రైతులంతా అరెకరం చొప్పున వేశారు. ఎకరానికి 600 మొక్కలు చొప్పున నాటారు ఈ ఏడాది యాపిల్ బేర్ దిగుబడి బాగా వచ్చింది. ఎకరంలో 20 నుంచి 25 టన్నుల దిగుబడి సాధించినట్టు రైతు శోభన్‌బాబు వివరించారు. కిలో రూ.70 హోల్‌సేల్‌గా విక్రయించినట్టు వివరించారు. టోకుగా రూ.100కు విక్రయిస్తున్నట్టు చెప్పారు. అర ఎకరంలోనే రూ.3లక్షలు ఆదాయం సాధించినట్టు వివరించారు.

ఎటువంటి వాతావరణంలోనైనా..



ఎటువంటి వాతావరణ పరిస్థితిలోనైనా యాపిల్ బేర్ సాగు చేపట్టవచ్చు. నీటి తడులు ఆలస్యమైనా ఇబ్బంది లేదు. జనవరి నుంచి ఆగస్టు పంటకాల పరిమితి. పంట పూర్తయ్యాక కొమ్మలు కత్తిరిస్తే వచ్చే ఏడాదికి మళ్లీ మొక్క కాపునకు వస్తుంది. కూలీలతో పనిలేదు. కుటంబ సభ్యులే సాగు చేసుకోవచ్చు. వ్యాపారులు తోట దగ్గరకే వచ్చి కొనుతోలు చేస్తున్నారు. ఎరువులు, పురుగు మందుల వినియోగం లేదు.

– చవ్వాకుల శోభన్‌బాబు, రైతు, తెలికిచెర్ల

మిశ్రమ పంటలపై దృష్టి



ఈ ప్రాంతలో మిశ్రమ పండ్ల తోటల వైపు రైతులు దృష్టి సారించి అధిక ఆదాయం సాధిస్తున్నారు. కాశ్మీర్ యాపిల్ బేర్ నలుగురు రైతులు సాగు చేస్తుండుగా తైవాన్ బొప్పాయి, సీడ్‌లెస్ పుచ్చ, తైవాన్ జామతో పాటు లక్నోజామ, అరటి తోటలు సాగు చేస్తున్నారు. ఉద్యానశాఖ రైతులకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం అందిస్తోంది.

–బోడిగడ్ల సురేష్ బాబు, ఉద్యాన సహాయకులు, తెలికిచెర్ల

దేశ సంస్కృతి, సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లాలి

శ్రీమాన్ వంశీకృష్ణ ప్రభూజీ


తెలికిచెర్ల శివాలయంలో ప్రవచనం చేస్తున్న శ్రీమాన్ శ్రీ వంశీకృష్ణ ప్రభూజీ

నల్లజర్ల: దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని భీమవరం ఇస్కాన్ దేవాలయానికి చెందిన శ్రీమాన్ వంశీకృష్ణ ప్రభూజీ ప్రభోదించారు. తెలికిచెర్ల శివాలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా భగవద్గీతపై పలు విషయాలు భక్తులకు వివరించారు. పాశ్చాత్యులంతా మన సంస్కృతి, సంప్రదాయాల వైపు పయనిస్తుంటే మనం మాత్రం వేరే దేశాలు సంస్కృతి వైపు పయనిస్తున్నారన్నారు. దేశ సంస్కృతిని, ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. భగవన్నామ స్మరణ మంగళకరమైందన్నారు. కార్యక్రమం ప్రారంభించినా భగవన్నామస్మరణతో ప్రారంభం కావాలన్నారు. సుబ్రహ్మణ్య స్వామి కథను వివరించారు. ముందుగా సనాతన ధర్మ కోసం మనమంతా సనాతన ధర్మం శాస్త్ర ప్రకారం తెల్సుకొని ఆచరించాలని అప్పుడే మానవజన్మకు సార్థకత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ భగవద్గీత (లెర్న్ గీత లివ్ గీత) మెంబరు కల్యాణి ప్రసాద్, దుర్గారావు, రాధాకాంతదాస్, భక్తులు పాల్గొన్నారు.


మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ


కొవ్వూరు: మత్తు పదార్థాల వినియోగంతో ఎన్నో అనార్థాలున్నాయని, డ్రగ్స్ వాడినా, అమ్మినా చట్ట రిత్యా నేరమని పొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ జి.సత్యనారాయణ పేర్కొన్నారు. పట్టణంలో హోలీ ఏంజెల్స్ హైస్కూలులో విద్యార్థులకు మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ జోలి వెళ్లి భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట ప్రకారం మత్తు పదార్థాలు వినియోగం, అమ్మకం చేసిన వేసే వివిధ రకాల శిక్షలు గురించి వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ వి.నెల్సన్ ఆంటోనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతోనే లక్ష్య సాధన


తాడిమళ్లలో జరిగిన పేరెంట్ టీచర్ మీటింగ్‌కు హాజరైన జిల్లా జాయింట్ కలెక్టర్ చినరాముడు


గౌరీపట్నం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థునులకు బహుమతులు అందజేస్తున్న కొవ్వూరు ఆర్డీఓ రాణి సునీత


కొవ్వూరులో అల్లూరి నాగరత్నం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి


గోపాలపురం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో దాత గంగరాజును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఉమాదేవి ఉపాధ్యాయులు

- జిల్లా జాయింట్ కలెక్టర్ చినరాముడు
- పాఠశాలల్లో పేరెంట్, టీచర్ సమావేశాలు

నిడదవోలు రూరల్: విద్యార్థులంతా పట్టుదలతో చదివి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు సూచించారు. నిడదవోలు మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్ టీచర్ సమావేశాలను శనివారం నిర్వహించారు. తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ చినరాముడు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. పాఠశాలల్లో కల్పించాల్సిన మౌలిక వసతులపై చర్చించారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, ఎంఈఓలు కేవీ గణేష్, పి.గురుమూర్తి, పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు దృష్టి : కొవ్వూరు ఆర్డీఓ

దేవరపల్లి: విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు దృష్టిపెట్టాలని కొవ్వూరు ఆర్డీఓ రాణీ సునీత సూచించారు. గౌరీపట్నంలోని జిల్లా పరిషత్ హైస్కూలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆర్డీఓ పాల్గొని మాట్లాడారు. ఉత్తమ ప్రతిభ గల విద్యార్థులకు ఆర్డీఓ బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులకు ముగ్గులు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈఓ ఎం.తిరుమలదాస్, ప్రధానోపాధ్యాయులు ఫణిశేఖర్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వాల్తేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. దేవరపల్లి మండలంలోని 45 ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.

నల్లజర్ల: నల్లజర్లలో పాఠశాలలో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, సర్పంచ్ పల్లి జ్యోతి, ఎంఈఓ వై.సత్యనారాయణ, తహసీల్దారు కృష్ణారావు, ఎస్ఐ బాలాజీ సుందర్రావు, విద్యాకమిటీ చైర్మన్ కోడూరి నారాయణ, హెచ్‌ఎం కోమలి చిత్ర, రావూరి వెంకటరమణ, గుదే సుబ్బారావు పాల్గొన్నారు. తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకోకుండా నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలతో కార్యక్రమం జరిగింది. దూబచర్లలో హెచ్‌ఎం సుమతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ భగవతి, ఎంపీడీఓ సింహాద్రి పాల్గొన్నారు. తూర్పుచోడవరం హైస్కూలులో హెచ్‌ఎం రవికుమార్, పద్మవాణి, విద్యాకమిటీ చైర్మన్ పి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు. మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్ఠి కావడంతో ఎక్కడ ఎక్కువ మంది తల్లిదండ్రులు హాజరుకాలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ 9వతేదీ వరకు అమలులో ఉంది. ఈ కార్యక్రమానికి నాయకులను ఎవర్ని ఆహ్వానించ వద్దని సర్క్యులర్‌లో అధికారులు పేర్కొన్నా స్థానిక ఉపాధ్యాయు లు అత్యుత్సాహంగా నాయకులను ఆహ్వానించారు. పోతవరంలో ఎంఈఓ–1 వై.సత్యనారాయణ, డీఎఫ్ఓ కృష్ణారావు, హెచ్‌ఎం గోపిగోవర్ధన్, ఎంపీడీఓ సింహాద్రి పాల్గొన్నారు.

కొవ్వూరు: ఉన్నత చదువులకు పేదరికం అవరోధంగా మారకూడదని మండల తహసీల్దార్ ఎం.దుర్గ ప్రసాద్ పేర్కొన్నారు. ఐ.పంగిడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్‌డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా ప్రాజెక్టు అధికారిణి సుభాషిణి,హెచ్‌ఎం ఎంఎస్ఎల్ఎస్‌వీ రామారావు,పేరెంట్స్ కమిటీ చైర్మన్ కారింకి వెంకటలక్ష్మి, నాయకులు పొట్రు సిద్ధూ,చొటుపల్లి శివ పాల్గొన్నారు.

నిడదవోలు : పట్టణంలో ఎల్ఎల్ఆర్ మున్సిపల్ హైస్కూల్, డొక్కా సీతమ్మ మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్, జెడ్పీ హైస్కూళ్లలో శనివారం ఆయా హెచ్‌ఎంల ఆధ్వర్యంలో పేరేంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు.

గోపాలపురం: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం పేరెంట్,టీచర్ కార్యక్రమం పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్లూరి ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి టి. కాంతీలాల్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

తాళ్లపూడి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతులుగా ఎదగాలని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు తెలిపారు. మండలంలోని పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు.